సాక్షి
నంద్యాల
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఎస్.లక్ష్మణరావు బుధవారం రూ.1,00,501 విరాళం ఇచ్చారు.



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం సాక్షిగణపతి స్వామికి, జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు.



భయం వీడితే జయం మీదే

పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయి. భయాన్ని జయిస్తే విజయం విద్యార్థులదేనని ఉపాధ్యాయ, వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నందీశ్వరస్వామికి విశేషపూజలు



బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు శాస్త్రోక్తంగా విశేషపూజలను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. బుధవారం 31 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేష పూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో, ఫలోదకాలతో అలాగే మల్లికాగుండంలోని శుద్ధ జలంతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యం సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లపై ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలోని పలు సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ స్టేషన్లు ఉన్న గ్రామాల్లో తమ సిబ్బంది పర్యటించి రాబోయే ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, మహిళలపై జరిగే నేరాల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


మహా 'నందీశ్వరుడి'కి ప్రదోషకాల అభిషేకం



మహానందిలో నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పండితులు

మహానంది: మహానందిలో కొలువైన నందీశ్వరస్వామికి పుష్యమాసం, బహుళ త్రయోదశి పురస్కరించుకుని బుధవారం సాయంత్రం మహా ప్రదోషకాలంలో అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో ముందుగా గణపతిపూజ, కలశార్చన, పీఠపూజ, పంచామృతాభిషేకం, చూర్ణాభిషేకం, అర్చనలు హారతులు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ నందీశ్వరస్వామికి ప్రదోషకాలంలో అభిషేకం చేసుకోవడం ద్వారా సకల దోషాలు తొలగి శుభాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, అర్చకులు, పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ నాగుల అంకన్న



కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ నాగుల అంకన్న నియమితులయ్యారు. ప్రస్తుతం వర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ ఉన్నారు. ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న అంకన్నను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సుందరానంద నియామక పత్రాన్ని జారీ చేశారు. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఈయన 2009లో వైవీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. అందరి సహకారంతో ఆర్‌యూ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- పల్లెపల్లెనా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు
- ఇప్పటికే మొదటి విడతలో 11,74,772 మందికి వైద్యం
- కొనసాగుతున్న రెండో విడత
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రెండో విడతలో దీబగుంట్లలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. పలు వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్న జగనన్న ప్రభుత్వం.. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామాలకు డాక్టర్లను పంపి వైద్య సేవలందిస్తోంది. సంపూర్ణ ఆరోగ్యాంధ్రగా మార్చే క్రమంలో వలంటీర్లను ఇంటింటికి పంపి వ్యాధి గ్రస్తులను గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు రప్పించి వైద్యం చేయిస్తోంది. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేసి అక్కడ ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తూ ప్రజారోగ్యానికి భరోసా ఇస్తోంది.

గోస్పాడు: ప్రజల ఆరోగ్యం విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ వహిస్తున్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పేరుతో పల్లెపల్లెనా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో ఈ కార్యక్రమం మంచి ఫలితాలివ్వడంతో రెండో విడత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 369 గ్రామ వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 105 అర్బన్ ప్రాంతాల్లోని వార్డు హెల్త్ క్లినిక్‌ల ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి.

మొదటి విడతలో..

గతేడాది సెప్టెంబర్ నెలలో జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి గ్రామాల్లో నిర్వహించిన వైద్యశిబిరాలకు రప్పించి వైద్య సేవలు అందించారు. నవంబర్ వరకు మొదటి విడత కార్యక్రమం కొనసాగింది. మొత్తం 11,74,772 మంది వైద్య సేవలు పొందారు. డాక్టర్లు పల్లె, వార్డు బాట పట్టడం.. ఇంటి వద్దే వైద్యసేవలు అందడంతో అన్ని వర్గాలు సంతోషం వ్యక్తం చేశారు.

రెండో విడతలో..

జనవరి 2వ తేదీ నుంచి జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' కార్యక్రమం ప్రారంభించారు. సాధారణ జబ్బులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను వైద్యులు గుర్తిస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామీణ ప్రాంతాల్లోనూ, ప్రతి బుధవారం అర్బన్ ప్రాంతాల్లోనూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. సాధారణ జబ్బులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, మూర్ఛ, గుండె జబ్బులు, ఇతర జబ్బులు ఏవైనా ఉంటే గుర్తించి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు.

స్పెషలిస్టు వైద్యులతో వైద్యం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో ముగ్గురు స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అందులో గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ ఉంటారు. ఈ ముగ్గురితోపాటు కంటి వైద్యులు ఉంటారు. వారితో పాటు 59 పీహెచ్‌సీల డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది కూడా శిబిరాలలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సక్రమంగా పని చేసేలా మండల అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులను కూడా ఇందులో భాగస్వాములను చేశారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు ఈ వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



రెండో విడతలో యాళ్లూరు-2 వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మొదటి విడత వైద్య శిబిరాలు : 417		రెండో విడతలో ఫిబ్రవరి 4 వరకు నిర్వహించిన వైద్య శిబిరాలు: 163
2,33,339	సాధారణ ఓపీ సేవలు	82,372
33,774	కంటి పరీక్షలు	6108
3,130	కంటి ఆపరేషన్‌కు గుర్తింపు	14
11,74,772	మొత్తం వైద్య పరీక్షలు	1,49,190

పట్టణం వెళ్లాల్సిన బాధ తప్పింది



గతంలో ఏ చిన్న అనారోగ్యం వచ్చినా పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. ఆరోగ్యం బాగా లేకుంటే పనులు మానుకుని ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ తప్పింది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యం అందిస్తున్నారు. బీపీ, షుగర్, ఇతర రక్త పరీక్షలు గ్రామంలోనే చేస్తూ, అవసరమైన మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు.

– మద్దిలేటి, యాళ్లూరు

ఆరోగ్య సురక్ష వరం



జగనన్న ఆరోగ్య సురక్ష మాలాంటి వారికి వరం. ఇంటి వద్దకే వచ్చి ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటూ వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం మా గ్రామానికే డాక్టర్లను పంపి, మా లాంటి వారికి వైద్య పరీక్షలు చేయిస్తోంది. నాకు కంటి శుక్లం ఉందని గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేశారు. మా లాంటి వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారు.

– లక్ష్మీదేవి, జూలేపల్లె

శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. మొదటి విడత పూర్తి చేసి ఈ ఏడాది జనవరి రెండో తేదీ నుంచి రెండో విడత సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పటికే 163 వైద్య శిబిరాలు పూర్తిచేసి ప్రజలకు వైద్య సేవలను అందించాం. స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

- శ్రీశైలం ఈఓ డి.పెద్దిరాజు



మాట్లాడుతున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 రోజుల పాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులకు సూచించారు. బుధవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ఆలయ, పోలీసు, రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, తాగునీటి సరఫరా, క్యూలైన్ల నిర్వహణ, ఆరుబయలు ప్రదేశాలలో విద్యుద్దీకరణ, తాత్కాలిక శౌచాలయాలు, పాతాళగంగలో ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. అన్ని వైదిక కార్యక్రమాలు నిర్ణయించుకున్న సమయానికి ప్రారంభమయ్యేలా వైదిక సిబ్బంది జాగ్రత్త వహించాలని ఈఓ ఆదేశించారు. పోలీసు శాఖ సమన్వయంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాతాళగంగలో నీటిమట్టం తగ్గుతున్న కారణంగా పుణ్యస్నానాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పాతాళగంగ వద్ద శౌచాలయాలు, స్నానఘట్టాల వద్ద పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్యూలైన్ల వద్ద, లడ్డూ ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు పరిశీలించి మరమ్మతులు చేయాలన్నారు. ఉత్సవాలలో మార్గ సూచికలను, సమాచార బోర్డులను అన్ని చోట్ల తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో ఏర్పాటు చేయాలన్నారు. లడ్డూ ప్రసాదాలు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఇప్పటికే సిద్ధం చేసుకున్న ప్రణాళికలను అనుసరించి ఉత్సవాలలో ఆయా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో దేవస్థాన సహాయ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, సీఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణరావు, ఉభయ ఆలయాల ప్రధానార్చకులు, వేదపండితులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మరో రెండేళ్ల పాటు మహానంది ఈఓగా కాపు చంద్రశేఖర్‌రెడ్డి

- ఉత్తర్వులు జారీచేసిన దేవదాయశాఖ అధికారులు



మహానంది: మహానంది దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి పదవీ కాలాన్ని మరో రెండేళ్లపాటు కొనసాగిస్తూ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల్ వలవన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం రాత్రి తెలిసింది. కాపు చంద్రశేఖర్‌రెడ్డి 2022 ఫిబ్రవరి 12న ఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో కృషి చేస్తున్నారు. దీంతో దేవదాయశాఖ అధికారులు ఆయన పనితీరును మెచ్చుకుని మరో రెండేళ్ల పాటు(2026 ఫిబ్రవరి వరకు) కొనసాగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు సూచించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల సంసిద్ధతపై ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను, హ్యాండ్ బుక్కులను నోడల్ అధికారులు క్షుణ్ణంగా చదివి, పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకుని లోటుపాట్లపై నివేదికను తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే మెటీరియల్ పోలింగ్ సిబ్బందికి అవసరమయ్యే వాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. యువ ఓటర్ల నమోదుకు అన్ని విద్యాసంస్థల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అభ్యర్థుల ఖర్చు వివరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పర్యవేక్షించాలన్నారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. లా అండ్ ఆర్డర్, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, మీడియా మేనేజ్మెంట్, కంప్లైంట్ రెడ్రెస్సల్ కమిటీలకు కేటాయించిన పనులు బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల నోడల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు.

శ్రీశైలం చేరుకున్న కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారులు

శ్రీశైలం ప్రాజెక్టు: నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లను కేంద్రం కృష్ణా నది యాజమాన్య బోర్డు పరిధిలోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణకు చెందిన అధికారులు, ఇంజినీర్లతో సహా నేషనల్ డ్యామ్ సెఫ్టీ అధికారులు, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారులు శ్రీశైలం డ్యామ్ పర్యవేక్షణ కోసం బుధవారం రాత్రి సున్నిపెంటకు చేరుకున్నారు. అధికారులు వీరికి ఏపీ జెన్‌కో అతిథి గృహంలో బస ఏర్పాటు చేశారు. డ్యామ్ సేఫ్టీ చైర్మన్ వివేక్ త్రిపాఠి, సభ్యులు అమిత్ మిట్టల్, కమలేష్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులు ప్రకాష్, విద్యాధర్, సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శర్వానంద్, తెలంగాణ, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ప్రమీల, ఆంధ్ర జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కబీర్ బాషా చేరుకున్నారు. వీరికి శ్రీశైలం డ్యామ్ ఎస్ఈ స్వాగతం పలికారు. ఈ బృందం గురువారం ఉదయం నుంచి శుక్రవారం వరకు డ్యామ్‌పై అధ్యయనం చేయనుంది.

ముమ్మరంగా జొన్న కోతలు



జొన్న కంకులను మిషన్ పడుతున్న కూలీలు

శిరివెళ్ల: మండలంలో జొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడి, ధర ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో మండలంలో 6,113 ఎకరాలలో రైతులు జొన్న పంట సాగు చేశారు. అత్యధికంగా గుంప్రమాన్‌దిన్నెలో 1,942 ఎకరాల్లో పంట సాగైంది. శిరివెళ్ల పరిధిలో 1,225 ఎకరాలు, జీనేపల్లె 867 ఎకరాలు, చెన్నూరు 983, గోవిందపల్లె 455, యర్రగుంట్ల 214, బోయలకుంట్ల 128, కామినేనిపల్లె 172, గంగవరం 25, మహదేవపురం 10, కోటపాడు 24, వనికినిదిన్నె గ్రామ పరిధిలో 55 ఎకరాల్లో జొన్నను రైతుల సాగు చేశారు. మిల్క్ వైట్ రకం జొన్న ఎకరాకు 17 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రాగా క్వింటాల్ రూ.3,250 ధర ఉంది. మహేంద్ర రకం జొన్న ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్లు రాగా క్వింటాల్ రూ.3,190 ఉంది. పెట్టుబడి ఎకరాకు రూ.17 వేల నుంచి రూ.20 వేలు అయ్యింది. కాగా దిగుబడి ఎకరాకు రూ.60 వేలు వస్తుంది. పెట్టుబడి పోనూ రైతుకు ఎకరాకు రూ.40 వేలు మిగులుతుంది. కౌలు రైతుకు అయితే పెట్టుబడి, కౌలు పోనూ ఎకరాకు రూ.20 వేలు మిగులుతుంది.

పెద్దాసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం



కోలుకున్న వీరన్నతో నెఫ్రాలజీ విభాగం వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ వ్యక్తికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం అయ్యింది. కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన వీరన్న(26) అనే వ్యక్తి ఆరేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని నెఫ్రాలజీ విభాగంలో చికిత్స తీసుకుంటూ ఉన్నాడు. వ్యాధి ముదిరిపోవడంతో ఆయనకు కిడ్నీ మార్చాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు అతనికి కిడ్నీని దానం చేసేందుకు వీరన్న తల్లి ఈరమ్మ ముందుకు వచ్చింది. ఈ మేరకు అతన్ని గత నెల 26వ తేదీన నెఫ్రాలజీ విభాగంలో చేర్చుకున్నారు. 29వ తేదీన యురాలజీ విభాగాధిపతి డాక్టర్ సీతారామయ్య బృందం అతనికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. అనంతరం నెఫ్రాలజీ విభాగంలో ఆయనకు ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటపక్కిరెడ్డి నేతృత్వంలో డాక్టర్ అనంత్, డాక్టర్ శ్రీధర్‌శర్మలు పర్యవేక్షిస్తూ చికిత్స అందించారు. ఈ మేరకు అతను కోలుకోవడంతో ఈ నెల 6వ తేదీన డిశ్చార్జ్ చేశారు. 2019లోనూ ఓర్వకల్లుకు చెందిన రామాంజనేయులు అనే యువకునికి తల్లి కిడ్నీ ఇవ్వడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. తాజాగా ఈ నెల 6వ తేదీ రాత్రి అవయవదానం చేసిన పావనీలత కిడ్నీతో మరో వ్యక్తికి కిడ్నీ మార్పిడి చేశారు. అతను ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు.

ప్లాస్టిక్ వ్యర్థాల కట్టడికి కమిటీ ఏర్పాటు

నంద్యాల(సెంట్రల్): శ్రీశైలం అటవీప్రాంత పరిధిలోని ప్రధాన రహదారుల వెంట యాత్రికులు విచ్చలవిడిగా పడేస్తున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రాజెక్టు టైగర్ క్షేత్ర సంచాలకులు చైర్మన్‌గా 9 మందితో కమిటీ ఏర్పాటుకు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం జీఓ నంబరు 11 ద్వారా వెల్లడించారు. నల్లమల అటవీ ప్రాంత రహదారుల వెంట వేస్తున్న వ్యర్థాలతో మానవ-జంతు సంఘర్షణకు దారితీస్తున్నందున ఈ పరిస్థితులపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కమిటీకి నిర్దేశించారు. కమిటీలో ఆత్మకూరు ప్రాజెక్టు టైగర్ ఉప సంచాలకులు, మార్కాపురం ఉప సంచాలకులు, ఆత్మకూరు డివిజనల్ అటవీ అధికారి, జిల్లా వన్యప్రాణి వార్డెన్, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఆత్మకూరు ఆర్‌డీఓ, ఆత్మకూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు, హెచ్‌వైటీఐసీఓఎస్ హైదరాబాద్ అధికారి సభ్యులుగా ఉన్నారు.

ఎండుమిర్చి క్వింటా రూ.16,100

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చియార్డులో ఎండుమిర్చి సూపర్-10 రకం ధర బుధవారం క్వింటా రూ.16,100 పలికింది. మధ్యస్థ ధర రూ.14,000, కనిష్ట ధర రూ.13,500 పలకగా ఇదే రకం తాలు కాయ గరిష్ట ధర క్వింటా రూ.7,300, మధ్యస్థ ధర రూ.6,000, కనిష్ట ధర రూ.5,000గా నమోదైనట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.



పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా పని చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి విజయ్‌శేఖర్, సెక్టోరల్ ఆఫీసర్ అబ్దుల్‌మాలిక్ ఉన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు:సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.358 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

భయం వీడితే జయం మీదే

- మార్చి 1 నుంచి ఇంటర్, 18 నుంచి పది పరీక్షలు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న మొత్తం విద్యార్థులు 58,694
- ఉత్తమ ఫలితాల సాధనకు కసరత్తు
- రివిజన్ కీలకమంటున్న విద్యాశాఖ అధికారులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు పక్కాగా కార్యాచరణ అమలు చేస్తున్నారు. నెలలు తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా పునశ్చరణ చేసుకోవాలని సూచిస్తున్నారు. సామర్థ్యాల మేరకు అత్యుత్తమ మార్కులు సాధించేలా పిల్లలతో పక్కాగా ప్రిపరేషన్ చేయిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒత్తిడిని జయిస్తే విజయం విద్యార్థులదేనని ఉపాధ్యాయ, వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. జిల్లాలో మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు మొత్తం 28,399 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 13,553 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14,846 మంది ఉన్నారు. అలాగే మార్చి 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు 30,295 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తంగా 58,694 విద్యార్థులు టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులంతా పక్కా ప్రిపరేషన్‌తో మంచి మార్కులు సాధించేందుకు విద్యాశాఖాధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉన్నత విద్యాశాఖాధికారులు ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేస్తున్నారు. ఒత్తిడిని జయించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను బోధిస్తున్నారు. పరీక్షల సమయంలో ఆందోళన గురికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ మార్కులు సాధించవచ్చని సూచిస్తున్నారు.

సమయ విభజన ముఖ్యం..

సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే దానిపై సాధించే మార్కుల శాతం ఆధార పడి ఉంటుంది. సబ్జెక్టులు, టాపిక్‌ల ప్రాధాన్యతలను గుర్తించి టైమ్‌ను విభజించుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్ది చాలా మంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు విరామం ఇవ్వడం వలన మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది.

రివిజన్ కీలకం...

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఎంత బాగా వచ్చిన అంశాలను కూడా తరుచూ రివిజన్ చేయాలి. అన్ని విద్యా సంస్థల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ కీలకమని భావించాలి. పాఠ్యాంశాల్లో కష్టంగా భావించి విస్మరించిన అంశాలపై కొత్తగా దృష్టి పెట్టడం మంచిది కాదని విద్యావేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో నేర్చుకున్న అంశాల్లో మరింత పట్టు సాధించేలా సమయాన్ని వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.



నంద్యాల మండలంలోని చాపిరేవుల జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

ఇలా ముందుకు...

- పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి. కొత్త అంశాల జోలికి వెళ్లకూడదు.
- టైం టేబుల్ సిద్ధం చేసుకుని అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా చూసుకోవాలి. కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి. పరీక్షల సమయంలో క్విక్ రివిజన్‌కి ఉపయోగపడుతుంది.
- తోటి విద్యార్థులతో అప్పుడప్పుడు సబ్జెక్టులపై చర్చించుకోవాలి.
- పాత ప్రశ్న పత్రాలు, మోడల్ ప్రశ్న పత్రాలను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.
- విరామం లేకుండా చదవడం సరికాదు. గంటకు ఒక 5 నిమిషాలు బ్రేక్ ఇచ్చి మళ్లీ చదవాలి.
- ప్రశాంతంగా రోజుకు 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి.
- పూర్తి పాజిటివ్ ఆలోచనతో ఉండాలి.



నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రీఫైనల్ పరీక్షలు రాస్తున్న ఇంటర్ విద్యార్థులు(ఫైల్)

50 రోజుల ప్రణాళికలు సిద్ధం



50 రోజుల ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా స్థాయి ఉన్నతాధికారులంతా విద్యార్థుల చదువులను పర్యవేక్షించడం జరుగుతోంది. రాత్రి సమయాల్లో కూడా విజిట్ చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రోజువారీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఆదివారం గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. పరీక్షలంటే భయం పోగొడుతున్నాం. త్వరలో రెండు. మూడు పాఠశాలలకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించనున్నాం.

– డీఈఓ, సుధాకర్‌రెడ్డి, నంద్యాల

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలి. ప్రొటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. రోజూ నిద్రతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

–డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్ఓ, నంద్యాల

ప్రతి నిమిషం విలువైనదే



విద్యార్థి జీవితంలో ప్రతీ నిమిషం విలువైనది. అన్ని సబ్జెక్టులకు సంబంధించి టైం టేబుల్ వేసుకుని సమయ పాలన పాటించి పరీక్షలకు సిద్ధం కావాలి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అన్ని సబ్జెక్టులు సులభంగా రాయగలననే ఆత్మ విశ్వాసం ఉండాలి. విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలి. ఈ విషయంలో తల్లిదండ్రులుజాగ్రత్తలు వహించాలి.

– సునీత, డీవీఈఓ, నంద్యాల

వైద్యులు వినూత్నంగా ఆలోచించాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు నిరంతరం వినూత్నంగా ఆలోచించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్ నిర్వహణపై అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదానాన్ని విజయవంతం చేసిన వైద్యులు సి. ప్రభాకర్‌రెడ్డి, అనంత్, సీతారామయ్య, వెంకట పక్కిరెడ్డి, కొండారెడ్డి, రామబాలాజి నాయక్, వెంకటరమణలతో పాటు ఆర్గాన్ కో ఆర్డినేటర్స్ సురేష్‌కుమార్, అర్షాద్‌లను ఆయన అభినందించి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఎండోక్రైనాలజి, న్యూరోసర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరి, పీడియాట్రిక్ సర్జరి, న్యూరాలజి విభాగాలలో ఈ–హాస్పిటల్‌ను ప్రారంభించాలని ఆదేశించారు. వైద్యులు ప్రతి పనినీ సమన్వయంతో చేయాలని, నలుగురు కలిస్తేనే ఎలాంటి పని అయినా విజయవంతం అవుతుందన్నారు. న్యూరాలజి విభాగంలో త్వరలో స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలో ఆసుపత్రి సమాచారానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, డాక్టర్ రాధారాణి, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్

అతి వేగానికి ఇద్దరు బలి

- మృతులు వరుసకు తల్లీకూతుళ్లు
- హనుమాపురం సమీపంలో దుర్ఘటన

పెద్దకడబూరు: కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో వరుసకు తల్లి, కుమార్తె అయిన జయలక్ష్మి, అక్షర మృతి చెందారు. ఈ దుర్ఘటన మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలోని నలందా కాలేజీ దగ్గర బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. హనుమాపురం గ్రామానికి చెందిన చెక్కర దస్తగిరి భార్య జయలక్ష్మి(39), దస్తగిరి సొంత తమ్ముడు అయిన శేఖర్ కుమార్తె అక్షర(9) ఇంటి నుంచి పొలానికి ఆదోని వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని కర్నూలుకు చెందిన టి.శ్రీనివాసులు(60) దంపతులు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరి కారు హనుమాపురం గ్రామ సమీపంలోని నలందా కాలేజీ దగ్గర వేగంగా వస్తూ జయలక్ష్మి, అక్షరను ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసులు దంపతులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులకు విషయం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు



మృతిచెందిన అక్షర, జయలక్ష్మి (ఫైల్)

నిధుల గోల్‌మాల్‌పై మరోసారి విచారణ

- ఆలూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కమిటీ

కర్నూలు సిటీ: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో డాక్టర్ ఎస్. రంగారెడ్డి ప్రిన్సిపాల్‌గా పనిచేసే సమయంలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై మరోసారి బుధవారం ఆ కాలేజీలో విచారణ జరిగింది. 2018–19లో డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. రంగారెడ్డి నిధులు దుర్వినియోగం చేశారనే ఫిర్యాదులు వచ్చాయి. విద్యార్థుల స్కాలర్‌షిప్ రూ.25 లక్షలు, యూజీసీ నిధులు రూ.2 లక్షలు, కాలేజీకి చెందిన పీజీ విద్యార్థుల ఫీజు రూ.లక్షకుపైగా కాజేశారనే ఆరోపణలు వచ్చాయి. అలాగే అధిక ధరకు 60 కంప్యూటర్లు కొనుగోలు చేసి 58 మాత్రమే కాలేజీకి అప్పగించారనే ఫిర్యాదు కూడా వచ్చింది. దీంతో అప్పట్లో డిగ్రీ కాలేజీల ఇన్‌చార్జ్ ఆర్జేడీగా ఉన్న రాజేశ్వరి, జాయింట్ కలెక్టర్ మణిమాల విచారణ చేపట్టారు. అయితే విచారణ పూర్తి కాకపోవడంతో మరోసారి ఉన్నత విద్యా మండలి ఓ కమిటీని గత నెలలో ఏర్పాటు చేసింది. ఇందులో ఆలూరు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్, ఆర్జేడీ కార్యాలయ పరిపాలన అధికారి విజయ్‌కుమార్, ముగ్గురు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించారు. ఈ కమిటీ బుధవారం కాలేజీకి వచ్చి విచారణ జరిపింది. అప్పట్లో కాలేజీలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది 45 మంది విచారణకు రావాలని సూచించింది. విచారణ కొనసాగుతోందని, పూర్తి స్థాయిలో రికార్డులు తనిఖీలు చేయాల్సి ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆలస్యం లేకుండా త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న తదితరులు విచారణ అధికారికి వినతి పత్రం అందజేశారు.



విచారణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కర్నూలు(సెంట్రల్):పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసీల్దార్ల బదిలీల నేపథ్యంలో ఓటరు ఫారాలను పరిష్కరించడంలో కొంత ఆలస్యమైందన్నారు. ఇక మీదట వేగవంతం చేస్తామన్నారు. ఈ వారంలో రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి ఏ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను ఏ భవనంలో ఏర్పాటు చేశామో తెలియజేస్తామన్నారు. అలాగే ఎన్నికల సామగ్రి తరలింపునకు ఎంపిక చేసిన భవనాలను నిర్ణయిస్తామన్నారు. పోలింగ్ విధుల కు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తప్ప మిగతా ప్రభుత్వ ఉద్యోగులందరూ పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

తక్షణం చర్యలు చేపట్టండి

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు తక్షణం చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె క్యాంపు కార్యాలయంలో నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కచ్చితంగా ర్యాంపు, విద్యుత్, మంచినీరు, టాయ్‌లెట్లు, గాలి, వెలుతురు వచ్చేలా మౌలిక వసతులు ఉండాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన మహిళా ఉద్యోగులు కూడా పోలింగ్ ముందు రోజు అక్కడే నిద్రచేసి పోలింగ్‌కు సిద్ధమవ్వాల్సి ఉందన్నారు. మౌలిక వసతులు కల్పించిన తర్వాత ఫొటోలను తనకు పంపాలన్నారు. డీఆర్వో కె.మధుసూదన్‌రావు, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ విజయ జ్యోతి కుమారి పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

కర్నూలు (న్యూటౌన్): నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లెలో సర్వే నంబర్ 838లో బి సరసయ్య,బి వెంకటేశ్వర్లు అక్రమంగా 8,382 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించారని విచారణలో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. వీరిద్దరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నా రు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

రికవరీలపై ప్రత్యేక దృష్టి

- డీసీసీబీ నూతన సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన కొమ్మా శివలీల

కర్నూలు(అగ్రికల్చర్): సహకార కేంద్ర బ్యాంకును మరింత బలోపేతం చేయడంతో పాటు రికవరీలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని నూతన కార్యనిర్వహణ అధికారి(సీఈఓ) కొమ్మా శివలీల తెలిపారు. బుధవారం ఆమె డీసీసీబీ నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీఈఓగా వ్యవహరించిన పి.రామాంజనేయులు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఎస్వీ విజయమనోహరి ఆధ్వర్యంలోని పాలకవర్గం డీసీసీబీలోనే జీఎం హోదాలో విధులు నిర్వహిస్తున్న శివలీలకు సీఈఓ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతల స్వీకరణకు ముందు ఆమె చైర్‌పర్సన్ విజయమనోహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె సీనియర్ అధికారులతో సమావేశమై బ్యాంకు ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ డోన్, పత్తికొండ, ఆలూరు, ఆదోని, కృష్ణానగర్ బ్రాంచీల్లో బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని రాబట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అందరి సహకారంతో డీసీసీబీని ప్రగతి పథంలో నడిపిస్తామని తెలిపారు. కాగా సీఈఓ పదవికి రాజీనామా చేసిన రామాంజనేయులు డీసీసీబీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు.



నూతన సీఈఓను అభినందిస్తున్న అధికారులు

సారా బెల్లం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని చూపుతున్న సీఐలు

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో సారా తయారు చేసేందుకు నిల్వ ఉంచిన 54 క్వింటాళ్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్‌రెడ్డి,సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు.బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చెక్‌పోస్టుల్లో పోలీసులు పహారా కాస్తుంటారని ముందుగానే బెల్లంను నిల్వ చేసుకున్నారన్నారు. సమాచారం అందడంతో మద్దికెరలో దాడులు నిర్వహించి ఎరుకలి దుర్గెన్న ఇంట్లో ఉంచిన రూ.2.50 లక్షల విలువ చేసే బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. దుర్గెన్నతోపాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్దికెర ఎస్ఐ రమేష్‌బాబు, సెబ్ ఎస్ఐ కార్తీక్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లలో కారం చల్లి రూ. 2 లక్షల అపహరణ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఓం శాంతి సర్కిల్ దగ్గర మంగళవారం రాత్రి ఓ వ్యక్తి కళ్లలో కారం చల్లి గుర్తుతెలియని వ్యక్తులు రూ. 2 లక్షలు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణం ఆదోని బైపాస్ రోడ్డులో ఉన్న అమృత బార్ అండ్ రెస్టారెంట్‌లో మీనప్ప మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే రెస్టారెంట్ మూసిన తరువాత మంగళవారం రాత్రి 11.30 ప్రాంతంలో రూ. 2 లక్షల నగదును తీసుకొని బైక్‌పై అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర ఉన్న తన ఇంటికి వెళ్తున్నాడు. అప్పటికే కాపుకాసిన గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి బైక్‌ను అడ్డుకొని కళ్లలో కారం చల్లారు. అతని దగ్గర ఉన్న క్యాష్ బ్యాగ్ తీసుకుని పరార్ అయ్యారు. మీనప్ప ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కర్నూలులో ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) కే సంతోష్‌రావు గురువారం కర్నూలు లో పర్యటించనున్నారు. బుధవారం రాత్రి కర్నూలుకు చేరుకున్న ఆయన.. గురువారం ఉదయం కర్నూలు శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలో ఏపీఈఆర్‌సీ భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తారు. అనంతరం కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్ భవన్‌లో ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. మిచాంగ్ తుఫాన్ సమయంలో విశేషంగా సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) Syndicate
కర్నూలు ఎస్.ఎమ్.ఇ. బ్రాంచ్ (13397) ఇండస్ట్రియల్ ఎస్టేట్, కర్నూలు, కర్నూలు జిల్లా-518003. ✆ 08518-230597, 9440905481

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, కర్నూలు స్పెషలైజ్డ్ ఎస్ఎమ్ఇ బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): M/s జాదా టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ వారు చెల్లించవలసిన బకాయి రూ. 1,76,63,493.01/- (DN తేదీ. 15.11.2018 నాటికి) + తదుపరి వడ్డీ, ఛార్జీలు ... స్థిరాస్తిని తేది 16-03-2024 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజలకు ... తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 16-03-2024, ఉ॥ 10.30 గం.లకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్ / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, కర్నూలు ఎస్ఎమ్ఇ బ్రాంచ్ వారి అకౌంట్ నెం: 209272434, IFSC Code: CNRB0013397 వారికి తేది: 15-03-2024, సా॥ 4.00 గం. లోపుగా చెల్లించవలెను.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా, కల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, కల్లూరు ఏరియా, వార్డు నెం. 89, ... సర్వే నెం 535/A1B, 535/A1C ... ప్లాట్ నెం. 22 మరియు 26 ... మొత్తం స్థలం విస్తీర్ణం 3071.25 + 676.50 = 3747.75 చ॥అ॥ లేదా 416.40 చ॥గ॥ లేదా 8.60 సెంట్లు.

రిజర్వు ధర: రూ. 52,46,000/- ధరావత్తు సొమ్ము: రూ. 5,24,600/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, స్పెషలైజ్డ్ ఎస్ఎమ్ఇ బ్రాంచ్, కర్నూలు మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 08518-230597, సెల్: 9440905481
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.
తేది: 06.02.2024, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) Syndicate
కర్నూలు ఎస్.ఎమ్.ఇ. బ్రాంచ్ (13397) ఇండస్ట్రియల్ ఎస్టేట్, కర్నూలు, కర్నూలు జిల్లా-518003. ✆ 08518-230597, మొబైల్: 9440905481

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)& 6(2) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల మరియు చరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, కర్నూలు ఎస్.ఎమ్.ఇ. బ్రాంచ్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు ... స్థిరాస్తులు మరియు చరాస్తులను తేది 28-02-2024న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ... విక్రయించబడునని ... తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 28-02-2024, ఉ॥ 10.30 గం.లకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్ / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, కర్నూలు ఎస్ఎమ్ఇ బ్రాంచ్ వారి అకౌంట్ నెం: 209272434, IFSC Code: CNRB0013397 వారికి తేది: 27-02-2024, సా॥ 4.00 గం. లోపుగా చెల్లించవలెను.

1. ఋణగ్రహీత: M/s. సాత్విక్ ఇండస్ట్రీస్, ప్రొప్రయిటర్: శ్రీమతి కె శ్రీదేవి, భర్త: కె సత్యనారాయణ. బకాయి మొత్తం: రూ. 19,46,614/- (డిమాండ్ నోటీసు తేది 31-01-2015 నాటికి) + తదుపరి వడ్డీ, ఇతర ఛార్జీలు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి చర మరియు స్థిరాస్తి వివరములు
Plant & Machinery: Reverse Osmosis Packaged Drinking water Plant, Cap: RO 2000LPH, consisting of high pressure Vertical Multi-Stage pump, FRP Pressure vessels 8-inch dia with membranes, micro Two Cartridge filter of 20 and 5 microns, flow meters, pressure Gauges, UV system, Control Panel, Dosing Pump, Pre-Treatment System, Post Micron Filter, Ozone Generator, Stainless steel Tanks-300 Liters, SS Pump etc, pouch Machine-1 No, and Lab Equipment etc.,
ఫ్యాక్టరీ భూమి మరియు బిల్డింగ్: ఆంధ్రప్రదేశ్, నంద్యాల జిల్లా, డోన్ మండలం, ధర్మవరం గ్రామం, ... సర్వే నెం. 613/F లో ఎ. 0.40 సెంట్లు, సర్వే నెం. 607/A1లో ఎ. 0.10 సెంట్లు ఫ్యాక్టరీ భూమి మరియు బిల్డింగ్ శ్రీమతి కాంబోజి శ్రీదేవి, భర్త: కె. సత్యనారాయణ పేరునగలదు. ... మొత్తం 21780 చ॥అ॥ లేదా 2420 చ॥గ॥ లేదా 50.00 సెంట్లు.
రిజర్వు ధర: రూ. 17,65,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,76,500/-
2. ఋణగ్రహీత: M/s. సాత్విక్ గ్రానైట్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి కె శ్రీదేవి, భర్త: కె సత్యనారాయణ. బకాయి మొత్తం: రూ. 17,78,224/- (డిమాండ్ నోటీసు తేది 31/01/2015 నాటికి) + తదుపరి వడ్డీ, ఇతర ఛార్జీలు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు
ఆంధ్రప్రదేశ్, నంద్యాల జిల్లా, డోన్ మండలం, ధర్మవరం గ్రామం, ... సర్వే నెం. 613/F లో ... ఎ. 0.26 సెంట్లు విస్తీర్ణం గల ఫ్యాక్టరీ భూమి మరియు బిల్డింగ్ ... మొత్తం విస్తీర్ణం 11,325.00 చ॥అ॥ లేదా 1258.40 చ॥గ॥ లేదా 26.00 సెంట్లు
రిజర్వు ధర: రూ. 5,85,000/- ధరావత్తు సొమ్ము: రూ. 58,500/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, స్పెషలైజ్డ్ ఎస్ఎమ్ఇ బ్రాంచ్, కర్నూలు మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 08518-230597, సెల్: 9440905481. ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.
తేది: 06.02.2024, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■One Sitting D.Ed, B.Ed, Degree, P.G., B.Tech, M.Tech, Contact: 81435 83986 [L-806375]
■ REGULAR/DISTANCE/ONESITTING/ DISCONTINUED/FAILURES/DETAINED: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, BBA, BCA, BED, MPED, LLB, MPHW, MBA, MCA, AGBSC, PHD. GOVT & PRIVATE JOBS ELIGIBLE : Cell: 8686172989. [L-806363]

DISTANCE DEGREE & PG
■Degree : B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLiSc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLiSc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: 90306 28410, 93937 28410. [L-806374]

SINGLE SITTING
■ SINGLE SITTING : 10th, 12th B.A, B.Com, B.Sc., M.A., M.Com., M.Sc., MBA, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs/Backlogs) from recognised Universities Exams in Feb/March Cont: 73383 76874 [R-339]

REAL ESTATE
PLOT FOR SALE
■ వేగంగా అభివృద్ధి అవుతున్న కర్నూలు-నందికొట్కూరు మెయిన్ రోడ్డులో కుడ అప్రూవుడ్‌తో నంద్యాల చెక్‌పోస్ట్‌కు 4 కి.మీ. దూరంలో ఓపెన్ ప్లాట్లు బ్యాంక్ లోన్‌తో కలవు. సెల్: 9533049765. [L-822352]

LAND FOR SALE
■ రాయలసీమ యూనివర్సిటీకి సమీపాన రాబోతున్న రింగ్ రోడ్డుకు ప్రక్కన ఉన్న 5 ఎకరాల పొలము (రోడ్డుకు మొదటి బిట్టు) అమ్మకానికి కలదు. సంప్ర: 95050 89451 [L-806373]

TO-LET
■ నంద్యాల రోడ్డు, దేవి ఫంక్షన్ ప్యాలెస్ మెయిన్ రోడ్డుపై 52x15 సైజు గల ఆఫీసు అద్దెకు కలదు. డాక్టర్లకు మాత్రమే ఇవ్వబడును. సంప్ర: 92469 22668 [L-806372]

SERVICES
BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1433]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6391]

WANTED
■ 7th-Degree, ITI, డిప్లొమా (P/F) అయ్యి ఖాళీగా ఉన్న 39 స్త్రీ/పురు కావలెను. జీతం: 14 వేలు+కమీషన్ 6 వేలు+ బోనస్+ ఫ్రీ రూం, భోజనం. Opp: శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు. 80748 16824 [L-822355]

■ డోన్ KVS హాస్పిటల్ నందు పనిచేయుటకు డ్యూటీ డాక్టర్స్ MBBS, BUMS, BHMS, BAMS (M/F) కావలెను. & మెడికల్ షాపులో పనిచేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు కావలెను. సెల్: 9533119937(డాక్టర్), PRO: 9966376749. [L-806370]
■ Wanted Staff: Sales Manager/Sales Executives/WorkShop Manager/Service Advisor/ Customer Care Executive and Spare Parts Incharge For PAVAN RACERS, TVS Motor Showroom, Arts College Road, ADONI - 94402 50250. [L-481]
■ శ్రీ శక్తి మ్యాక్స్ లి॥ నందు పని చేయుటకు ఆఫీస్ స్టాఫ్ M/F కావలెను. అర్హత: డిగ్రీ. సం.ప్ర: 4th ఫ్లోర్ ఐకాన్ షాపింగ్ మాల్, బిర్లా కాంపౌండ్, కర్నూలు. సెల్: 8341380122, 9502766466. [L-806371]
■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 99595 43389 [V-797176]
■ మీ జిల్లా అంతటా మండలాల వారిగా ప్రభుత్వ సంస్థలలో అవుట్ సోర్సింగ్ జాబ్స్ కలవు. Qul: SSC to Degree, A: 18 to 40, Sal: 15,000 to 28,000. 98851 22226. [T-4897]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ అవులను చూసుకొనుటకు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13030]
■ పారుల్ యూనివర్శిటీ బ్రాండ్ ప్రమోషన్ కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. వయస్సు: 21-28సం॥ సంప్ర॥ నవీన్ చంద్ కొత్త అయ్యప్పస్వామిగుడి, కె.సి.కెనాల్, కర్నూలు. 9381049149 [G-8210]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూం+భోజనం HYD. PH: 7995984445. [HA-1188]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

